కథ

అన్వేషణ

— జి. శ్రీనివాస్

సాయంత్రం ఆరౌతూంది.

అక్కడంతా నిర్మానుష్యంగా వుంది. దరిదాపుల్లో ఎవ్వరూ కన్పించటం లేదు.

కాళ్ళ క్రింద నలిగే ఎండుటాకుల శబ్దం మినహా అంతా నిశబ్దంగా వుంది. ఎక్కడి నుంచో తీతువు అప్పుడప్పుడు అరుస్తుంది. అది వూరికి దూరంగా వున్న స్మశాన ప్రదేశం. కనుచూపు మేరలో అంతా తుప్పలు, పొదలు, చెట్లే.

నేను నెమ్మదిగా కొంచెం భయంగా అడుగులో అడుగు వేస్తు నడవ సాగాను. కొంచెం దూరం వెళ్ళేసరికి ఎదురుగా చితి కన్పించింది. వేగంగా దాన్ని దాటి ముందుకు వెళ్ళాను. మరోచోట కపాలాలు, ఎముకలు కన్పించాయి. స్మశానానికి రావటం అదే మొదటిసారి. అంతా భయానకంగా వుంది. నా గుండె చప్పుడు స్పష్టంగా వినబడుతోంది. అక్కడి నుండి మరింత ముందుకు వెళ్ళాను. నెమ్మదిగా తూర్పున చీకట్లు కమ్ముకుంటున్నాయి. మెళ్ళోని బైనాక్యులర్స్ తీసి చుట్టూ చూసాను. బాగా పెరిగిన పొదలు అక్కడక్కడా చెట్లు, సమాధులు.

బైనాక్యులర్స్ వదలి నడవసాగాను.

నేను ఇక్కడకు రావటానికి పెద్ద కారణమేవుంది.

అది - అసలు దెయ్యాలు వున్నాయా, లేవా? వుంటే ఎలా వుంటాయి? ఏం చేస్తాయి? మనిషికి నిజంగా హాని చేస్తాయా?

ఆస్తిక, నాస్తికులు దాని గురించి మాట్లాడుకున్నా ఇది మిద్దంగా తేల్చి చెప్పరు. అందుకే నాకు నేనుగా ఈ కార్యానికి ధైర్యంగా శ్రీకారం చుట్టి దెయ్యాల అన్వేషణకు బయలుదేరాను.

నిర్ణయమైతే ధైర్యంగా తీసుకున్నా గాని స్మశాన వాతావరణం భయం కల్గిస్తుంది.

నిజానికి భయమే దెయ్యాలున్నాయనే వూహకి మొదటి మెట్టు. ఈసారి ధైర్యంగా ముందుకు కదిలాను.

కొంత సేపటికి ఒక పెద్ద చింత చెట్టు మొదట్లో ఓ వ్యక్తి కన్పించాడు. దగ్గరగా వెళ్ళి చూసాను. మనిషే పర్వాలేదు.

బాగా పెరిగిన గడ్డం. తైల సంస్కారం లేని ఊడలు గట్టిన జుత్తు, మాసిన గుడ్డలతో పిచ్చివాడిలా వున్నాడు.

నేను రావటం గమనించలేదు. చిన్నగా దగ్గాను.

అతను కళ్ళు విప్పి ఆశ్చర్యంగా చూసాడు. ఒక నిమిషం అలా చూసి అడిగాడు ఎవర్నువ్?

నవ్వి చెప్పాను. మనిషిని.

అంతే అతను భీకరంగా నవ్వాడు. వెంటనే చెట్లపై వున్న పక్షులు అరుచుకుంటూ గుంపుగా పైకెగిరాయి.

నేను జడుసుకున్నాను. ఇంత భయంకరమైన నవ్వు కూడా వుంటుందన్న మాట.

నవ్వటం ఆపి అన్నాడతను. ఏమో దెయ్యానివనుకున్నా'.

నేను మాట్లాడలేదు.

అతను కూర్చోమని సైగ చేసాడు. ఎందుకైనా మంచిదని దూరంగా కూర్చున్నాను. నా మెళ్ళోని బైనక్యులర్స్ని, భుజానికి వేళ్ళాడుతున్న బ్యాగ్ను మార్చి మార్చి చూసాడు. తర్వాత నా ముఖంలోకి చూసి అడిగాడు. ఎందుకొచ్చావిక్కడికి?

ఇతని ద్వారా ఏమైనా విషయాలు తెలియవచ్చు అనుకుంటూ నా అన్వేషణ గురించి చెప్పాను.

నా అన్వేషణకు పనికి వచ్చే విషయాలు తెలుస్తాయని అతని వివరాలు అడగటం మొదలుపెట్టాను.

'నీ పేరేంటి?'

'మంత్రాల మరిడయ్య'

'ఏంటీ?!' ఆశ్చర్యంగా అడిగాను.

మళ్ళీ అదే చెప్పాడు.

'ఏం చేస్తుంటావ్? ఇక్కడ?

మనుషుల్ని దెయ్యాలుగా తయారుచేస్తా' కళ్ళు మూసుకునే సమాధానం చెప్పాడు.

నేను భయంగా పరిశీలనగా చూసాను. ఇతను మనిషే, కాకపోతే పిచ్చాడై వుంటాడు.

'ఎప్పటి నుండి వుంటున్నావిక్కడ?'

'ఏమో తెలీదు'

సమస్యలేదు. ఇతను ఖచ్చితంగా పిచ్చాడే. అనవసరంగా కదిపాను.

మేవ్వు దెయ్యాల్ని చూడాలని వచ్చావా? సూటిగా న కళ్ళలోకి చూస్తు అడిగాడు.'

'అవును'.

అతను మౌనంగా తన కుడివైపు చూపించాడు. నేనటు చూసాను. ఆశ్చర్యం! దూరంగా ఇద్దరు వ్యక్తులు కన్పించారు.

నేను బైనాక్యులర్‌తో చూసాను. మరింత ఆశ్చర్యం! వారిలో ఒకరు ఆడ మరొకరు మగ. పెద్ద వయస్సున్న వాళ్ళు కాదు. బహుశా ప్రేమికులై వుంటారు. ఒకరికి దగ్గరగా మరొకరు నడుస్తూ నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. చీకటి పడుతుందన్న ధ్యాసైనా లేకుండా కుషీగా స్మశానంలో కబుర్లు చెప్పుకుంటున్నారు. పార్కులు, సిన్మా హాళ్ళు చాల్లేనట్లుంది. ఇక్కడ క్కూడా తగలడుతున్నారు. బహుశా ఇక్కడైతే ఎవరికీ కన్పించనవేమో. 'వాళ్ళు మనుష్యులు దెయ్యాలు కాదు' వాళ్ళనే చూస్తూ చెప్పాను.

'సరిగ్గా చూడు'.

'అబ్బే మనుష్యులే'.

'కాదు. వాళ్ళు దెయ్యాలు. వాళ్ళ గురించి నాకు బాగా తెలుసు'.

బైనక్యులర్స్ వదలి అతనివైపు చూసాను.

'నీకెలా తెలుసు?'

అతను చెప్పటం మొదలు పెట్టాడు. అతని పేరు సుబ్బారావు. ఆ అమ్మాయి పేరు సుబ్బలక్ష్మి. ఇద్దరూ ప్రేమించుకున్నారు. మన తెలుగు సిన్మాలోలా పెద్దాళ్ళు వాళ్ళ పెళ్ళికి ఒప్పుకోలేదు. (అహో! తెలుగు సిన్మాలు కూడా తెలుసన్న మాట. బహుశా ఆ సిన్మాలు గాని హైద్రాబాద్ టివి సీరియల్స్ గాని చూసి చూసి ఇలా అయిపోయుంటాడు). దాంతో ఆ ప్రేమికులు త్యాగానికి సిద్దపడి ఓ రోజున దగ్గరకొచ్చారు. నేనో సలహా చెప్పాను. దాని ప్రకారం సుబ్బారావ్, సుబ్బలక్ష్మిలు ఆత్మహత్యలు చేసుకున్నారు. కాని వాళ్ళ ఆత్మలు చావలేదు'.

'ఆత్మహత్య చేసుకున్నాక ఆత్మలు చావక పోవటం ఏమిటి?' మధ్యలో అడిగాను.

''పిచ్చివాడా(?!) ఆత్మకు చావు లేదు. అది అమరం. కోరికలు తీరిన ఆత్మ పరమాత్మలో కలుస్తుంది. తీరనివి ప్రేతాత్మలుగా ఈ లోకంలో తిరుగుతూ వుంటాయి. అర్థమైందా?'' అంటూ ప్రేమ కథని కంటిన్యూ చేశాడు.

'ఆ విధంగా చావులేని వారి ఆత్మలు వాళ్ళు చనిపోయిన తర్వాత కలుసుకున్నాయి. ఇప్పుడు వాటిని ఎవ్వరూ వేరు చెయ్యలేరు. వాళ్ళు ఎంతో హాయిగా ప్రేమించుకుంటూ కుషీగా ఈ స్మశానంలో షికార్లు చేస్తున్నారు. అదీ వాళ్ళ కథ' అంటూ ముగించాడు.

నేను బైనాక్యులర్స్‌తో మళ్ళీ చూసాను. అప్పటికి వెలుతురు బాగా తగ్గింది. వాళ్ళ ఆకారాలు మాత్రమే కన్పిస్తున్నాయి. అవి వూరి వైపు వెళ్ళే దారిలో వడివడిగా పోతున్నాయి. అలా చూస్తుండగానే మాయమయ్యాయి.

నేను మరిడయ్య వైపు చూసాను. అతను నవ్వుతూ చూస్తున్నాడు. నాకెందుకో అనుమానం కలిగింది. ఇదంతా కట్టు కథ అనుకున్నాను.

'ఈ రాత్రంతా ఇక్కడే వుంటావా?' అడిగాడతను.

నేను తలుపాను. అతను వెనక్కి జారబడి పైకి చూస్తుండి పోయాడు.

అతన్ని ఫొటో తీయాలనిపించింది. వెంటనే బ్యాగ్‌లోని కెమెరా తీసి ఫ్లాష్ ఉపయోగించి ఫొటో తీసాను. అతనేం మాట్లాడలేదు.

ఈ రాత్రంతా ఎలా గడుస్తుందో అనుకుంటుండగా దూరంగా ఏవో అరుపులు విన్పించాయి. 'నక్కల అరుపులు' చెప్పాడు మరిడయ్య.

నిశ్శబ్దంగా అటే చూస్తుండి పోయాను.

రాత్రి పదకొండు అవుతుండగా అడిగాడతను. దెయ్యాలంటే మనుష్యుల కెందుకింత భయం?'

'అవి మనుషుల్ని పట్టి పీడిస్తాయని, నానా విధాల హింసిస్తాయని, రక్తం కక్కుకొని చచ్చేట్లు చేస్తాయని అనుకుంటారు' చెప్పాన్నేను.

'నువ్వెప్పుడైనా అలాంటి దెయ్యాల బాధితుల్ని చూసావా?'

'లేదు' చెప్పాను.

అతను గాఢంగా నిట్టూర్చి తల అడ్డంగా వూపి లేచి నిల్చున్నాడు.

నేను మాట్లాడేలోపే 'నాతో రా' అంటూ ముందుకు కదిలాడు. నేను అతని వెనుకే ఫాలో అయ్యాను.

కొంత దూరం నడిచిన తర్వాత ఒక సమాధి దగ్గర ఆగాడతను.

'ఇదెవరిదో తెలుసా?' అడిగాడు.

నాకెలా తెలుస్తుంది. తల అడ్డంగా వూపాను.

'నా చెల్లెలిది' అంటూ మోకాళ్ళపై కూలబడి తలవంచుకుని వుండిపోయాడు.

నాకేమనాలో తెలియలేదు. మనసంతా అదోలా అయ్యింది. ఆ చీకట్లో అలాగే అతన్ని చూస్తు వుండిపోయాను.

నన్ను పట్టించుకోకుండా అతను చెప్పాడు. నా పదిహేను సంవత్సరాల వయస్సులో తల్లితండ్రులు పోయారు. నేను చెల్లెలు తప్ప ఇంకెవరూ లేదు. మావాళ్ళు మిగిల్చిన ఆస్తిని అమ్మి చెల్లెలి పెళ్ళి చేసాను. ఆర్నెల్లు తిరక్కుండానే అత్తింటి పోరు మొదలైంది. నాకు చేతనైనా రీతిలో డబ్బు ఎప్పుడూ పంపిస్తుండే వాడిని. అయినా వాళ్ళ దాహం తీరలేదు. ఓ రోజు నా చెల్లెల్ని సజీవంగా తగలబెట్టి చేతులు దులుపుకున్నారు. సాక్ష్యాలు లేని హత్య ఆత్మహత్యగా మారిపోయింది'

అంటూ చిన్నగా నవ్వి లేచాడు. ఒక్క క్షణం సమాధివైపు చూసి ముందుకు కదిలాడు. నేను వెనుకే అనుసరించాను. అటువంటి కేసులకు సంబంధించిన మరిన్ని సమాధులు చూపించాడు.

క్రిందటేడాది ఎలక్షన్లో నామినేషన్ వేసి ప్రత్యర్థి బెదిరింపులు పెడచెవిన పెట్టడంతో హత్యకు గురైన రాజకీయ నాయకుడి సమాధి చూపించాడు. ఎవరు చంపారో తెలీని ఒక విలేకరి సమాధి చూపించాడు.

అంతా అటుపోయిన తర్వాత తిరిగి బయలుదేరిన చోటుకి చేరుకున్నాడు.

నాకు ఒక్కసారిగా నీరసం ఆవహించి కూలబడ్డాను.

మరిడయ్య హుక్కా వెలిగించి ఒక్క దమ్ములాగి అన్నాడు. ఇప్పుడు చెప్పు. నువ్వేమో కనబడని దెయ్యం కోసం పని గట్టుకొని వచ్చావే. అవి మనుషుల్ని హింసిస్తాయని, చంపుతాయని అంటారన్నావ్. అది నిజమో కాదో తెల్సుకోవటానికి ఇక్కడికి వచ్చావ్. కానీ నీ చుట్టూ వున్న సమాజంలోనే కన్పించని దెయ్యాల కన్నా దారుణంగా ప్రవర్తించే మనుష్యులున్నారు. వాళ్ళు దెయ్యాలకన్నా, రాక్షసులకన్నా భయంకరమైన వాళ్ళు. అందరూ కనబడని వాటి గురించి భయపడుతూ తమ చుట్టూ వున్న అసలైన దెయ్యాల వికృత చేష్టలు గమనించలేక పోతున్నారు. కాబట్టి ఓ మనిషీ దెయ్యాలున్నాయి. అవి నా చెల్లెలి అత్తలా వున్నాయి. ప్రత్యర్థిని చంపిన 'రాజకీయుడి'లా వున్నాయి. విలేకరిని హింసించి చంపిన వాళ్ళలో వున్నాయి. లంచాలు తీసుకునే వాళ్ళలో వున్నాయి. రెడ్ టేపిజంలో వున్నాయి. సర్కారు ఫైల్స్‌లో వున్నాయి. మనుషుల్ని హింసించేవే దెయ్యాలైతే ఇవన్నీ దెయ్యాలేగా మరి. అవి నీలో వున్నాయి. నాలో వున్నాయి. ఈ సమాజంలోని ప్రతి వ్యక్తిలో పెద్దతనం అన్న ముసుగులో వున్నవన్నీ దెయ్యాలే' అతను చెప్పటం ఆపి వొగర్చాడు. నేను వింతగా చీకట్లో కన్పించని అతని భావాల కోసం ప్రయత్నించి విఫలమయ్యాను.

అంతే అతను మరిక మాట్లాడలేదు. ఇద్దరం నిశ్శబ్దంగా వుండిపోయాం. సరిగ్గా మూడవుతుండగా కనుకుపాట్లు లోంచి తెప్పరిల్లి చుట్టూ చూసాను. అంతే ఒక్కసారిగా తుళ్ళిపడ్డాను.

మరిడయ్య అక్కడ లేడు. టార్చిలైట్‌తో కొంత దూరం వెతికాను. కన్పించలేదు. ఎక్కడకు వెళ్ళుంటాడు.

ఆ రాత్రంతా అతను కన్పించలేదు. తెల్లవారు తుండగా నేను బయలుదేరి అక్కడ నుండి బైటపడ్డాను.

రెండ్రోజుల తర్వాత డెవలప్‌మెంట్ కోసం ఇచ్చిన ఫొటో కోసం వెళ్ళాను. స్టూడియో కుర్రాడికి డబ్బులు చెల్లించి అతనిచ్చిన కవరుతో కొద్ది దూరంలో వున్న పార్కులోనికి వెళ్ళి ఎవరూ లేని చోట కూర్చున్నాడు.

నెమ్మదిగా కవరులోని ఫొటో తీసి చూసాను. ఆ ఫొటోలో చింత చెట్టు మొదలు తప్ప మరేమీ లేదు. ఆశ్చర్యం! చింత చెట్టుకు జారగిలబడి కూర్చున్న మరిడయ్య ఫొటోలో లేడు. కాని అతని వెనుకున్న చింతచెట్టు స్పష్టంగా వచ్చింది. అంతే మరిడయ్య!!

బహుశా ఫొటో పోయి వుంటుంది అంతే. అనుకుంటూ ఫొటో కవరులో పెడుతూ చుట్టు చూసాను దూరంగా ఓ జంట కూర్చొనివుంది. వాళ్ళు తను రోజు చూసిన శ్మశాన ప్రేమికుల్లా వున్నారు. డౌట్ లేదు వాళ్ళే. వాళ్ళ దగ్గరకు వెళ్ళి ఆ సంగతే అడిగాను. వాళ్ళు సిగ్గుతో ఒప్పుకున్నారు. తను రోజు సరదాగా వెరైటీగా వుంటుందని వెళ్ళినట్లు చెప్పారు.

నేను మరిడయ్యను వివరించి వాళ్ళకు తెలుసేమో అడిగాను.

అసలు అటువంటి వ్యక్తిని తాము చూడలేదన్నారు. అతనెవరో తెలియదన్నారు.

చివరిగా వాళ్ళ పేరు అడిగాను.

అతను చెప్పాడు.

నా పేరు సుబ్బారావే. ఈమె సుబ్బలక్ష్మి' అంతే నా చేతిలోని కవరు జారిపోయింది.